క్లుప్తంగా

రేపు శ్రావణి హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

మార్కాపురం: అక్టోబరు 2న మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని శ్రావణి హాస్పిటల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పిల్లి కనకదుర్గ విలేకరులకు తెలిపారు. స్వాతంత్య్రం కోసం మహాత్మాగాంధీ చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ 2వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు

రాచర్ల: మండల అర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఎల్.అనూష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా పనిచేస్తున్న చిన్నబ్బాయి నెల్లూరు జిల్లాకు బదిలీ కావడంతో అయన స్థానంలోకి గిద్దలూరు మండల అర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎల్.అనూషను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పారు.



శ్రీనివాసరావు

కొమరోలు: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా ఎం.శ్రీనివాసరావు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఏఈ మాట్లాడుతూ.. మండలంలో ఎక్కడా నీటి సమస్య లేకుండా చూసుకుంటానని, సమస్య ఉన్నట్లయితే వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు.

నగర పంచాయతీ ఏఈగా రవీంద్రుడు



రవీంద్రుడు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీ ఏఈగా యండాల రవీంద్రుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏఈ శంకర్‌నాయక్ మార్కాపురం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో చీమకుర్తిలో పనిచేస్తున్న యండాల రవీంద్రుడిని నియమించారు. ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరిస్తానని నూతన ఏఈ చెప్పారు.

బాధ్యతలు చేపట్టిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు



సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం: మార్కాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా ఉన్న శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. వెంకటరెడ్డి ఇప్పటి వరకు ఒంగోలు విజిలెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై మార్కాపురంలో నియమితులయ్యారు.



సీఐ అరుణకుమారి

పొదిలి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా టి.అరుణకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ ఒంగోలు స్క్వాడ్ టీమ్‌కు బదిలీ కాగా నరసరావుపేటలో సీఐగా విధులు నిర్వహిస్తున్న అరుణకుమారిని పొదిలిలో నియమించారు. స్టేషన్ సిబ్బంది అరుణకుమారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాస రచనలో సత్తా చాటిన వహీదా



వహీదా

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థిని షేక్ వహీదా జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర పోటీల్లో సత్తా చాటింది. ఒంగోలు డీఆర్‌ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాస రచన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి తెలిపారు. ఆమెను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యాసరచన విజేతకు సత్కారం



విద్యార్థిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎంపీయూపీ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న సీహెచ్ పవన్ మండల స్థాయి వ్యాస రచనలో ప్రథమ బహుమతి పొందడంతో సోమవారం పాఠశాలలోని ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూపని వెంకట నారాయణ, ఉపాధ్యాయులు డి.లక్ష్మయ్య, రంగస్వామి, అరుణ కుమారి, వెంకటేశ్వర్లు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో

కూటమి పెత్తనమేంటి?



టీడీపీ కౌన్సిలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఇస్మాయిల్



మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ

- ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను ఎలా తొలగిస్తున్నారు?
- మీ సానుభూతిపరులను అడ్డగోలుగా నియమించడం పద్ధతేనా?
- కూటమి నాయకుల తీరుపై వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ల ఆగ్రహం
- ప్రజాప్రతినిధులకు అధికారులు కనీస గౌరవం ఇవ్వాలని హితవు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో వైఎస్సార్ సీపీకి చెందిన చైర్మన్ ఉండి, 30 మంది కౌన్సిలర్లు ఉన్నప్పటికీ కూటమి కౌన్సిలర్లు పెత్తనం చేస్తూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ విభాగాల్లో పార్టీలకతీతంగా కార్మికులు పని చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సుమారు 20 నుంచి 30 మందిని ఆప్కాస్‌తో సంబంధం లేకుండా తొలగించి కూటమి సానుభూతిపరులను నియమించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాల్లో చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, ముంగమూరి శ్రీను తదితరులు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులందరూ పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలే కానీ కేవలం ఒక వర్గానికి లబ్ధి చేకూరేలా వ్యవహరించడం ఎంత వరకు సబబని నిలదీశారు. రెండు నెలలుగా వర్షాలు లేక ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాల్సిన పరిస్థితుల్లో అన్ని ట్యాంకర్లను కూటమి నాయకులు పంచుకోవడాన్ని తప్పుబట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అదనంగా సుమారు 35 కాంట్రాక్టు కార్మికుల పోస్టులను మంజూరు చేసి నియమించామని, కూటమి నాయకులు అలాంటి ప్రయత్నాలేమీ చేయకుండా తమ పార్టీవారు కాదంటూ ఉన్నవారందరినీ తొలగించడాన్ని తీవ్ర స్థాయిలో ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపాలిటీల్లో కార్మికుల పని తీరు సక్రమంగా లేదని, విధులకు గైర్హాజరై ప్రజలకు సరైన సేవలు అందించడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం మారిన తరువాత నుంచి అధికారులు కూడా కూటమి నాయకులు చెప్పిన వారికే పనులు చేస్తున్నారని, ప్రజా ప్రతినిధులందరికీ విలువ ఇస్తూ పనులు చేసేలా ఉండాలని హితవు పలికారు. కౌన్సిల్‌లో అభ్యంతరాలు వచ్చిన 12 పనులకు ఆమోదం తెలపలేదు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, మేనేజర్ శ్రీనివాసన్, ఆర్ఓ అఫ్జల్‌ఖాన్, ఏఈలు ఆదినారాయణ, శంకర్‌నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాన్ని నివారించండి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్



పొదిలి : ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ, సూపర్‌వైజర్లు

- సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం రూరల్: బాలింతలు, గర్భిణులు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ఆయన సందర్శించి అభినందించారు. ఐసీడీఎస్ సిబ్బంది గ్రామాల్లో పోషకాహార లోపాలున్న వారిని గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న ఆహారాన్ని అందిస్తూ వారికి అవగాహన కల్పించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో దొరికే ఆకుకూరలు, కాయగూరలతో మంచి పౌష్టికాహారాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, సీడీపీఓ సుశీలాదేవి, సూపర్‌వైజర్లు బుజ్జి, రవికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పొదిలి: పోషణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఐసీడీఎస్ పొదిలి ప్రాజక్టు ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసి ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీఓ సుధా మారుతి మాట్లాడుతూ.. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, చట్టపరంగా తీసుకునే చర్యల గురించి వివరించారు. అంగన్‌వాడీలు తయారు చేసిన పోషకాహారాన్ని స్టాల్లో ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు సావిత్రి, సుభాషిణి, ప్రసన్న, సరిత, ఝాన్సీరాణి, పొదిలి, కొనకనమిట్ల మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ బి.జ్యోతి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక సీడీపీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడంలో అశ్రద్ధ చేస్తే పుట్టబోయే బిడ్డకు కూడా హాని కలుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణాల ఉద్యోగుల బంద్



డిపో మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

మార్కాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మద్యం దుకాణాల పనిచేస్తున్న సేల్స్ సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు బంద్‌లో పాల్గొననున్నట్లు సంఘ నాయకులు నందిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుమార్ బాబు తెలిపారు. సోమవారం డిపో మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందించారు. తమను గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం షాపుల్లో పనిచేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసి సేల్స్‌మెన్స్‌గా, సూపర్‌వైజర్లుగా 17 వేల మంది ఉద్యోగులను నియమించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రతపై ఎటువంటి హామీ ఇవ్వనందుకు నిరసనగా అక్టోబరు 1 నుంచి విధులకు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సుబ్బారావు, ఉస్మాన్, రామకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సాయం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ-2

కొనకనమిట్ల: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని ఎంఈఓ-2 బరిగె నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని నాగంపల్లి యూపీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులు పలువురు గ్రామంలో ఇంటింటికీ తిరిగి విజయవాడ వరద బాధితుల సహాయార్థం పోగు చేసిన నగదు రూ.5 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. విద్యార్థులు పునుగోటి దుర్గా, తంగిరాల మేఘనారెడ్డి, కసిబిసి వెంకటబ్రహ్మం, మేకల విష్ణు, సిరిమెళ్ల బాలఅఖిల్, వేగినాటి మణికంఠ, పూజిత, కుమారి, తేజను ఎంఈఓతోపాటు హెచ్ఎం జె.వెంకటేశ్వర్లునాయక్, ఉపాధ్యాయులు పద్మగాయత్రి, మోహన్, రాధా భవాని, ప్రసాద్, సురేష్, నాగలక్ష్మి తదితరులు అభినందించారు.

3 నుంచి దసరా సెలవులు

రాచర్ల: దసరా, శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 3వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవులు ప్రకటించిందని ఎంఈవో-2 వారణాసి గిరిధర్‌శర్మ సోమవారం తెలిపారు. 2వ తేదీ బుధవారం గాంధీ జయంతి సెలవు కావడంతో ఒకరోజు ముందు నుంచే పాఠశాలలు మూతపడనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని స్పష్టం చేశారు.

నేడు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక కార్యదర్శి ఈశ్వర్ తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టును గతనెల 25వ తేదిన నిర్వహించామని, అందులో మొదటి స్థానంలో నిలిచిన వారికి మంగళవారం మండల స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఎంపీడీఓ నరసింహులుకు ఘనంగా వీడ్కోలు



ఎంపీడీఓ దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

తర్లుపాడు: ఎంపీడీఓగా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన ఎస్.నరసింహులుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. గత 37 ఏళ్లుగా ఆయన చేసిన సేవలను డీఎల్‌డీఓ సాయికుమార్, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు కొనియాడారు. గ్రామాల అభివృద్ధికి ఎంపీడీఓ నరసింహులు ఎంతో కృషి చేశారని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పెద్ద మస్తాన్ అభినందనలు తెలిపారు. ఎంపీడిఓ నరసింహులు చేసిన సేవలను కొనియాడారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎంపీడిఓ దంపతులను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మురారితోపాటు పలువురు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓ స్నేహితులు పాల్గొన్నారు.

కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



క్షతగాత్రులను పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

పొదిలి: కూలీ పనులు చేసుకుని ట్రాక్టర్‌లో వస్తూ ప్రమాదానికి గురై గాయాలపాలైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. కాటూరివారిపాలెం వద్ద ట్రాక్టర్ ట్రక్ బోల్తా పడటంతో గాయపడిన వారిని, కుటుంబ సభ్యులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ సోమవారం పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని కూడా పరామర్శించినట్లు తెలిపారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారని, మరో 13 మందికి స్వల్పంగా గాయలయ్యాయని, ఇటువంటి ప్రమాద సందర్భాల్లో బాధితులను ఆదుకునేందుకు ఎటువంటి రక్షణ చట్టం లేకపోవడం బాధాకరమన్నారు. కూలీల కుటుంబాలను ఆదుకునే పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. పూర్తిగా కోలుకునేంత వరకు వైద్య సేవలు అందించాలన్నారు. సీఎం సహాయ నిధి నుంచి వీరి కుటుంబాలకు తోడ్పాటు అందించాలని కోరారు. సీపీఎం నేతల వెంట చాగంటి కోటేశ్వరరావు, కాటూరి అశోక్ తదితరులు ఉన్నారు.

మహాత్మా బీజేపీ పాలన నుంచి దేశాన్ని కాపాడు

- అక్టోబర్ 2న విగ్రహాలకు వినతి పత్రాలు

పొదిలి: మహాత్మా బీజేపీ దురహంకార పాలన నుంచి దేశాన్ని కాపాడు అనే నినాదంతో అక్టోబర్ 2వ తేదీన గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు షేక్.సైదా ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీ జయంతి సందర్భంగా పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి ఆదేశాల మేరకు గాంధీ విగ్రహాల వద్ద నివాళులర్పించి, వినతిపత్రాలు ఇవ్వాలని సైదా కోరారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో పార్టీ బాధ్యులు పాల్గొని కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. అదే రోజు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని తెలిపారు.

అంధకారంలో తెల్లదిన్నె గ్రామం



వీధిలైట్లు లేక చీకటిగా ఉన్న గ్రామం

కంభం: మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలోని తెల్లదిన్నె గ్రామంలో సుమారు 7 నెలలుగా వీధిలైట్లు వెలగక అవస్థలు పడుతున్నా పంచాయతీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో కేవలం ఒక వీధిలైటు మాత్రమే వెలుగుతుందని మిగిలినవి వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శిగానీ, ఇతర అధికారులు కానీ ఎవరూ సమస్యను పరిష్కరించడం లేదని ఆరోపించారు. రాత్రి పూట బయటకు రావాలంటే భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటోల్లో ప్రయాణికుల పరిమితి మించితే కఠిన చర్యలు

- సీఐ సుబ్బారావు



ఆటోవాలాలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బారావు, ఎస్సై సైదుబాబు

మార్కాపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ సుబ్బారావు సూచించారు. సోమవారం సాయంత్రం పట్టణ ఎస్సై సైదుబాబుతో కలిసి చెరువుకట్ట రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన చెరువుకట్ట రోడ్డుపై పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని తీసుకొస్తున్న పలువురి వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. మంగళవారం నుంచి మార్కాపురం పట్టణంలో ఆటో డ్రైవర్లు ఎవరైనా పరిమితికి మించి ఎక్కించుకుని కనిపిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు దగ్గర ఉంచుకోవాలని స్పష్టం చేశారు. అధిక సంఖ్యలో ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లే సమయంలో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆటో డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు కూడా ఆటోల్లో ఎక్కేటప్పుడు డ్రైవర్ పక్కన కూర్చోవడం, ఫుట్‌బోర్డ్‌పై నిలబడటం లాంటివి చేయొద్దని హితవు పలికారు.

సీఎం సహాయనిధికి పాత్రికేయుల విరాళం

మార్కాపురం టౌన్: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు మార్కాపురం ప్రెస్‌క్లబ్ తరఫున 50 వేల రూపాయల చెక్కును సోమవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి.మోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, ఏపీయుడబ్ల్యూజే అధ్యక్షుడు ఎన్వీ రమణ అందించారు. సీఎంఆర్ఎఫ్‌కు చెక్కు అందజేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎం.అల్లూరెడ్డి, పి.ఓబయ్య, టి.నారాయణరెడ్డి, బాషా, నరేంద్ర, శేఖర్, నాగార్జున, కె.శ్రీనివాసులు, రాజ్‌కమల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెట్ టాపర్స్ జాబితా విడుదల

మార్కాపురం టౌన్: ఎస్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ టెట్ మోడల్ పరీక్షలో విజయనగరానికి చెందిన ప్రవళిక 133 మార్కులతో స్టేట్ టాపర్‌గా నిలిచిందని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.ఎర్రయ్య, నరసింహారెడ్డి తెలిపారు. 3 వేల మందికి పైగా అభ్యర్థులు పాల్గొనగా, విజయనగరానికి చెందిన రామలక్ష్మి 129 మార్కులు, పశ్చిమ గోదావరికి చెందిన త్రివేణి, లావణ్య 128 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని వెల్లడించారు. విజేతలకు ఈనెల 2న నిర్వహించనున్న ఎస్‌టీయూ కార్యవర్గ సమావేశంలో బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వేతనం కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా



నిరసన తెలుపుతున్న స్వచ్ఛభారత్ కార్మికులు

కొమరోలు: వేతన బకాయిలు మంజూరు చేయాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికులు నిరసన దీక్ష ప్రారంభించారు. మండల కేంద్రమైన కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 14 గ్రామ పంచాయతీల స్వచ్ఛభారత్ కార్మికులు సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ డి.నరసయ్యకు తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్మికులు నినాదాలు చేస్తూ.. 24 నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులకు అర్జీలు ఇస్తున్నా తమ సమస్యపై స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పొదిలి బాలుడి ప్రతిభ



పథకంతో బాలుడు అర్హన్

పొదిలి: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-7 విభాగంలో పొదిలి బాలుడు అర్హన్ ప్రతిభ కనపరిచాడు. రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్(వన్‌డే ర్యాపిడ్ ఓపెన్‌చెస్) పోటీలు కడపలో నిర్వహించారు. ఈపోటీల్లో పాల్గొన్న పొలిచెర్ల రహమాన్ కుమారుడు అర్హన్ రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానంలో నిలిచాడు. వందల సంఖ్యలో పోటీదారులు పాల్గొన్న టోర్నమెంటులో రాష్ట్ర స్థాయిలో ఐదో స్థానం పొందిన అర్హన్‌కు పథకం, ప్రశంస పత్రం అందజేశారు. చిన్నారిని పలువురు అభినందించారు. మరింత పేరు ప్రఖ్యాతులు పొందాలని కోరుకున్నారు.

జాబ్‌మేళాలో 42 మందికి ఉద్యోగాలు

దర్శి: స్థానిక ప్రభుత డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలలో 42 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు ప్రిన్సిపాల్ ఏవీ కవిత తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి జిల్లా ఉపాధి కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా సోమవారం జాబ్‌మేళా నిర్వహించాయి. ప్రిన్సిపాల్ ఏవీ కవిత మాట్లాడుతూ మేళాలో అరబిందో ఫార్మాకు 9 మంది, డీమార్ట్‌కు 23 మంది, మాస్టర్ మైండ్స్‌కు 10 మందిని ఎంపిక చేశారు. మొత్తం 116 మంది నిరుద్యోగులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. జాబ్‌మేళాలో 13 మందికి ఇంటర్న్ షిప్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఆయా సంస్థల ప్రతినిధులు వెంకట గణేష్, పోలయ్య, ఉజ్వల సంస్థల వివరాలు తెలియజేశారు. స్కిల్‌హబ్, జాబ్‌మేళా ట్రెనింగ్ కో ఆర్డినేటర్‌లు డాక్టర్ నగేష్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు ఆందోళనకరం

కంభం: కులహంకారంతో రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతుండటంతో రక్షణ లేకుండా పోతోందని షెడ్యూల్ కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అనేక చోట్ల దళితుల భూములను అగ్ర కులస్తులు ఆక్రమించుకుని వారిపైనే దాడులు చేస్తున్నారన్నారు. దళితులకు న్యాయం చేకూరాలంటే ఖాళీగా ఉన్న ఎస్సీ కమిషన్ చైర్మన్, మెంబర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.